

విరబూసిన మామిడి పూత

ప్రజాశక్తి - కడియం



మండలంలోని పలుచోట్ల మామిడి చెట్లు విరబూసి కనువిందు చేస్తున్నాయి. కాయలు 'కాపు'తో రైతులకు మంచి రాబడి వస్తుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. చెట్లు గల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల రహదారుల చెంతన ఉన్న మామిడి చెట్లు చూపరులను అబ్బురపరుస్తున్నాయి. మండలంలోని మురమండ, దుళ్ల, జేగురుపాడు తదితర గ్రామాల్లో పలుచోట్ల మామిడి చెట్లు అధిక పూతతో దర్శనమిస్తున్నాయి.

ఆటస్థలం అన్యాక్రాంతం

- సేవ ముసుగులో స్థలం కాజేసేందుకు సిద్ధం
- చక్రం తిప్పుతున్న అధికారపక్షం ప్రజాప్రతినిధి?
- ధవళేశ్వరం జూనియర్ కళాశాలలో ఆక్రమణలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

'ఆడుదాం ఆంధ్ర' పేరుతో క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామంటూ ప్రచారం చేస్తున్న వైసిపి సర్కారు ఆచరణలో భిన్నమైన విధానాలను అవలంభిస్తోంది. ఆటల్లో ఆణిముత్యాలను వెలికితీస్తామంటూ చెబుతూనే మరోపక్క ఉన్న ఆటస్థలాన్ని ఆక్రమణదారులకు కట్టబెట్టేందుకు కుట్రలు పన్నుతోంది. అధికారపక్షం ప్రజాప్రతినిధుల వల్ల ఆడుదాం ఆంధ్ర కాస్తా ఆడుకోలేం ఆంధ్రగా మారుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ధవళేశ్వరం జూనియర్ కళాశాలకు నాలుగు దశాబ్దాలకు పైగా చరిత్ర ఉంది. ఎంతో మంది ఈ కళాశాలలో చదివి ఉన్నత స్థానాల్లో నిలిచారు. విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ పోరాటాల నేపథ్యంలో కళాశాలకు సొంత స్థలాన్ని, భవనాలను ప్రభుత్వం కల్పించింది. 2004లో ఎనిమిదబ్బూయి ట్రస్ట్ ఉండే ప్రాంతంలో 2.05 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వకాలేజీ ఏర్పాటు చేశారు. కాలేజీ నిర్మాణానికి అప్పటి ఎంపీ ఎస్‌బిపిబికె.సత్యనారాయణ ఎంపీ నిధుల నుంచి రూ.10 లక్షలు, రాజ్యసభ సభ్యులు దాసరి నారాయణరావు, టి.సుబ్బిరామిరెడ్డి, ఖాన్ ఒక్కొక్కరు రూ.5 లక్షలు చొప్పున రూ.15 లక్షలు, ఒఎన్‌జిసి సిఎస్ఆర్ నిధులు రూ.9.20 లక్షలు, బోర్డు ఆఫ్ ఇంటర్మీడియెట్ నుంచి రూ.6.90 లక్షలు, పుష్కర నిధుల నుంచి రూ.2 లక్షలు వెచ్చించి భవనాలను నిర్మించారు. విశాలమైన ఆటస్థలంతో కళాశాల భవనం నిర్మితమైంది. 2007లో అప్పటి ఎంఎల్ఎ జక్కంపూడి రామ్మోహనరావు రూ.60లక్షలతో కళాశాలకు అనుసంధానంగా కాన్ఫరెన్స్ హాలు నిర్మించారు. ఇది స్థానిక ప్రజల శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలు కోసం, తద్వారా వచ్చే ఆదాయాన్ని కళాశాల అభివృద్ధికి వెచ్చించాలనే ఆలోచనతో దీన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ కాన్ఫరెన్స్ హాలును కళ్యాణ మండపంగా మార్చేశారు. ఇప్పుడు మండపంతో పాటూ క్రీడా స్థలంలో సగభాగం లీజుకు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. అధికార పక్షం ప్రజాప్రతినిధి తోడు అధికారులు అండదండలు ఉండటంతో ఏకపక్షంగా ఆటస్థలం మధ్యగా గోడను నిర్మించారు.



ఆటస్థలం మధ్యగా కట్టిన గోడ

ఏడాదికి రూ.2 లక్షల చొప్పున లీజుకు...

ధవళేశ్వరంలో ఎకరా స్థలం రూ.2కోట్లుపై మాటే. కళాశాలలో కళ్యాణ మండపంతో పాటు, ఆటస్థలంలో సగభాగం కలిపి ఏడాదికి రూ.2 లక్షల చొప్పున ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. ఓ చారిటబుల్ ట్రస్టు పేర్లు పాటు లీజుకు ఇవ్వాలని అధికార యంత్రాంగం ఇంటర్మీడియట్ బోర్డుకు 2023 డిసెంబరు 12న ప్రతిపాదనలు పంపించి. కాని బోర్డు నుంచి ఇప్పటి వరకూ ఎలాంటి ఆదేశాలు రాలేదు. అయినప్పటికే యుద్ధప్రాతిపదికన కళాశాల ఆటస్థలాన్ని రెండుగా విభజిస్తూ అడ్డుగా గోడను నిర్మిస్తున్నారు. ఈ గోడ నిర్మాణం కోసం నాడు -నేడు నిధులు రూ.8.81 లక్షలు వెచ్చిస్తున్నారు. కేవలం ఇద్దరు పేరెంట్స్‌తో ఏర్పడిన కాలేజీ డెవలప్‌మెంట్ కమిటీ 2022 నవంబరు 4న తీర్మానం చేసి ఉన్నతాధికారులకు నివేదించినట్లు రికార్డులు చెబుతున్నాయి. జిల్లాలో ఓ ఉన్నతాధికారి 2022 నవంబరు 1న మౌఖిక ఆదేశాలివ్వటంతో ప్రణాళికా బద్ధంగా స్థలం అన్యాక్రాంతం అవుతోందని స్పష్టమవుతోంది.

గోడ నిర్మాణాన్ని తక్షణమే నిలిపేయాలి



కళాశాల క్రీడా ప్రాంగణంలో అడ్డుగా నిర్మిస్తున్న గోడను తక్షణమే నిలుపుదల చేసి తొలగించాలి. ధవళేశ్వరంలో జూనియర్ కాలేజీకి ఘన చరిత్ర ఉంది. ఇక్కడ ప్రజలు పోరాడి దాన్ని సాధించుకున్నారు. ఈ కాలేజీలో విద్యనభ్యసించిన విద్యార్థులు, క్రీడా కారులు ఉన్నత శిఖరాలను అధిరోహించారు. కళాశాల ప్రాంగణంలో సగభాగం ఇతర అవసరాలకు కేటాయించడం అన్యాయం.

- టి.పాల్సన్, పూర్వ విద్యార్థి ప్రభుత్వ జూనియర్ కళాశాల

వ్యాపార కేంద్రంగా మార్చడం తగదు



కళాశాల ప్రాంగణం విద్యార్థుల అవసరాల కోసం మాత్రమే వినియోగించాలి. ప్రయివేటు వ్యక్తుల చేతికి అప్పజెప్పి వ్యాపార కేంద్రంగా మార్చాలను సబబు కాదు. ఈ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి ఆటల పోటీల్లో నేనూ పాల్గొన్నాను. క్రీడ స్థలాన్ని అభివృద్ధి చేయాలని గాని ఇలా అన్యాక్రాంతం చేయడం తగదు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలి.

- ఒంటెద్దు స్వామి, క్రీడాకారుడు, పూర్వ విద్యార్థి

కలెక్టర్ ఆదేశాల మేరకే ప్రహరీ నిర్మాణం

కలెక్టర్ కె.మాధవీలత ఆదేశాల మేరకే ప్రహరీ నిర్మిస్తున్నాం. కళ్యాణ మండపంలో వేడుకలు జరుగుతున్నప్పుడు కళాశాల ఇబ్బందిగా మారింది. ప్రిన్సిపల్స్ నిర్వహణ బాధ్యత మరింత భారమైంది. కాలేజీ డెవలప్‌మెంట్ కమిటీ తీర్మానం చేసి లీజుకు ఇవ్వాలని ప్రతిపాదించింది. ఆ తీర్మానాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళాం. లీజుకు ఇచ్చినప్పటికీ ఇంటర్మీడియట్ బోర్డు పరిధిలోనే స్థలం ఉంటుంది.

- వై. శారద, ఆర్‌జెడి, ఇంటర్మీడియట్ బోర్డు



ఉరితాళ్లు వేసుకుని, మోకాళ్లపై నిల్చుని నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

ఉరితాళ్లతో ఎస్ఎస్ఎ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సమగ్రశిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలోకి విలీనం చేసి, రెగ్యులర్ చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని లేకపోతే ఉరి వేసుకుని ఆత్మహత్యలు చేసుకోవాల్సి వస్తుందని మెడలకు ఉరి తాడును వేసుకుని నిరసన వ్యక్తం చేస్తూ, సమగ్రశిక్ష ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రాజమహేంద్రవరం నగరంలోని డిఇఒ కార్యాలయం వద్ద సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (జెఎసి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 14వ రోజు నిరవధిక సమ్మె దీక్షా శిబిరంలో పలువురు మాట్లాడారు. ప్రస్తుతమున్న పార్ట్ టైం విధానాన్ని రద్దుచేసి, ఫుల్ టైం కాంట్రాక్టు విధానాన్ని అమలు చేయాలని, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని, కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చి, మినిమం టైం స్కేల్ అమలు చేసి, వేతనాలు పెంచాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు కోరుతున్న న్యాయపరమైన డిమాండ్లు సాధించే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని జెఎసి నాయకులు ఎమ్.రఘునాథ్, డి.వంశీకృష్ణంరాజు, పి.దుర్గా ప్రసాద్, ఆర్. వెంకట్రాజు, మీరప్రకాష్, వెంకట్ తెలిపారు. అనపర్తి మండల ప్రయివేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడు ఎస్.నాగార్జున మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. భవిత కేంద్రాల్లో తమ కంటే ఎంతో నేర్పు, ఓర్పుతో దివ్యాంగులైన తమ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను, విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని భవిత కేంద్ర తల్లులు కొప్పర్తి పద్మ, అడ్డాల వినీత, గోపి లీలా భవానీ సిఎం జగనను కోరారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఉద్యోగులు వెంకట రమణ, సతీష్ బాబు, చంద్రకుమార్, రవికుమార్, రామచంద్రరావు, వెంకటరత్నం, భువనేశ్వరి, వాసవి, దానకుమారి, దాక్షాయణి లత, అన్నామణి, కనకదుర్గ, అన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు బుధవారం నుంచి చేపడుతున్న సమ్మెకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని ఎఐటియుసి జిల్లా నాయకులు తాటిపాక మధు, కూండ్రపు రాంబాబు కోరారు. మంగళవారం స్థానిక దానవయిపేట, జాంపేట, అప్సర సెంటర్లలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్ మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని ఇచ్చిన హామీ ఐదేళ్లు కావస్తున్నా అమలు చేయలేదన్నారు. ఇప్పటికే మున్సిపల్ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి పలు రూపాల్లో తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు.



మున్సిపల్ సమ్మె కోసం ప్రచారం చేస్తున్న ఎఐటియుసి శ్రేణులు

ప్రభుత్వ వైఖరితో విసిగివేశారిపోయిన కార్మికులు సమ్మెలోకి అడుగుపెడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు సంగిరెడ్డి రమణ , దుర్గమ్మ, అల్లం వెంకటేశులు, బంగారు నాగేశ్వరావు, ముత్యాలు మురళి, అల్లం బాలు, కాకి శారదా, ముత్యాలు నంద కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నన్నయలో 3, 4 తేదీల్లో ప్లేస్‌మెంట్ డ్రైవ్

ప్రజాశక్తి - రాజానగరం

ఈ నెల 3, 4 తేదీల్లో నన్నయ యూనివర్శిటీ ఎంఎస్‌సిఆర్గానిక్ కెమిస్ట్రీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు విసి ఆచార కె.పద్మ రాజు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఫార్మాసూటికల్ సంస్థ జివికె బయో సైన్సెస్ ఆర్గన్ లైఫ్ సైన్స్ వారి సహకారంతో ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉమ్మడి గోదావరి జిల్లాలో ప్రస్తుతం ఎంఎస్‌సి ఆర్గానిక్ కెమిస్ట్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు దీనికి అర్హులని అన్నారు. రాతపరీక్ష, ఉత్తీర్ణులైన విద్యార్థులకు టెక్నికల్ అండ్ హెచ్‌ఆర్ రౌండ్స్ నిర్వహించి ఎంపిక చేస్తారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులకు హైదరాబాద్‌లోని జివికె బయోసైన్సెస్ ఆర్గన్ లైఫ్ సైన్స్ సంస్థలో నెలకు రూ.27 వేల జీతంతో ఉద్యోగం కల్పిస్తారని అన్నారు. అర్హత కల్గిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేటి నుంచి చాగల్లు రైల్వే గేటు మూసివేత

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు రైల్వే స్టేషన్ పరిధిలోని ట్రాక్ మరమ్మతులు నిమిత్తం నేటి నుంచి నాలుగు రోజులపాటు చాగల్లు రైల్వే గేటును మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకూ ఉయదం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ గేటును మూసివేస్తామని, కావున ప్రయాణికులు ప్రత్యామ్నాయాలు చూసుకోవాలని సూచించారు.

దున్నపోతులకు అంగన్‌వాడీల వినతులు

- సమస్యల పరిష్కారంతోనే సమ్మె విరమణ
- నేడు కలెక్టరేట్ల ముట్టడికి పిలుపు
- యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బేబీరాణి పిలుపు

ప్రజాశక్తి - యంత్రాంగం

తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు 22వ రోజైన మంగళవారం వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. గత 21 రోజులుగా వివిధ రూపాల్లో ప్రభుత్వానికి విన్పించేలా ఉద్యమాన్ని చేపట్టారు. అయినా స్పందించకపోవడంతో దున్నపోతు ప్రభుత్వం కళ్లు తెరవాలంటూ దున్నపోతులకు వినతిపత్రాలు అందించారు. **రాజమహేంద్రవరం** 'ఎన్ని బెదిరింపులకు పాల్పడినా బెదిరేది లేదు. తమ ముందున్న అంశం సమస్యల పరిష్కారమే. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారంతోనే తమ సమ్మె విరమణ ఉంటుంది' అని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షరాలు జి.బేబిరాణి స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగుతున్న నిరసన శిబిరాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం ముందుకురావాలని, కలెక్టర్ల ద్వారా బెదిరింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, అధికారుల తీరును నిరసిస్తూ బుధవారం జరుగుతున్న చలో కలెక్టరేట్‌ల ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అంగన్‌వాడీలకు ఆమె పిలుపునిచ్చారు..22 రోజులుగా అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె చేస్తున్న ప్రభుత్వం దున్నపోతు మీద వాన పడిన చందంగా చోద్యం చూస్తుందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో లక్షలాదిమంది లబ్ధిదారులు తీవ్ర అవస్థలు పడుతున్న జగన్ ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. ఎన్నికల ముందు రోడ్లు పట్టుకుని తిరిగిన జగన్ ఎన్నికల తర్వాత అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను మరిచారని, ఇప్పటికైనా జగన్ తమ సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని, లేనిపక్షంలో రాబోయే ఎన్నికల్లో జగన్‌కు అంగన్‌వాడీల సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. ఇప్పటివరకు పోరాటం శాంతియుతంగా సాగిందని, ఇక మీదట పోరాటాలు ఉధృతం అవుతాయని అన్నారు. సమస్యలు పరిష్కరించమంటే అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టి సెంటర్లను తెరిచినా నిర్వాహణ చేయడంలో ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు అంగన్‌వాడీల సేవలను గుర్తించి సమస్యలు పరిష్కారానికి చర్చలు జరిపి సమ్మె విరమణ చేయించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.బేబీరాణి, రాజమహేంద్రవరం ప్రాజెక్ట్ అధ్యక్షులు కె.శారద, కోశాధికారి రామలక్ష్మి, నాయకులు నాగరాణి, శేశారత్నం, మరియమ్మ, రోజ్ మేరీ, సెక్టర్ లీడర్లు, నాయకత్వం వహించారు. **ఉండ్రాజవరం** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరుగుతున్న సమ్మె నిరసన శిబిరానికి అంగన్‌వాడీలు చేరుకున్నారు. అక్కడ నుంచి నినాదాలు చేసుకుంటూ గొడ్ల చావిళ్లకు చేరుకుని దున్నపోతుకు తమ సమస్యలతో కూడిన వినతిపత్రాలను అందించి నిరసన వ్యక్తం చేశారు. **కడియం** తమ సమస్యలను పరిష్కరించడంలో దున్నపోతు ప్రభుత్వం మేల్కోనాలని కోరుతూ గేదెలకు అంగన్‌వాడీలు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాజానగరం ప్రాజెక్ట్ యూనియన్ నాయకురాలు వై.సుజాత మాట్లా డుతూ ప్రభుత్వం వితండ వాదన మాని నిర్లక్ష్యం వీడి, సమస్యలు పరిష్కరించాలని కోరారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను మాత్రమే అమలుచేయాలని కోరుతున్నామని, తామేమి గోంతెమ్మ, అమలు సాధ్యం కానీ కోర్కెలు కోరడం లేదని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. **గోకవరం** స్థానిక తహశీల్దార్ కార్యాలయం సమీపంలో జరుగుతున్న అంగన్‌వాడీల నిరసన రిలే నిరహారదీక్ష కొనసాగింది. ఈ దీక్ష శిబిరాన్ని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజు సందర్శించి సంఘీభావాన్ని తెలిపారు. అలాగే గోకవరం ఆర్‌టిసి డిపో కార్మికులు, టిడిపి నాయకులు దీక్ష శిబిరం సందర్శించి మద్దతు తెలిపారు. **గోపాలపురం** స్థానికంగా అంగన్‌వాడీలు చేస్తున్న రిలే నిరహారదీక్షలు కొనసాగాయి. ప్రభుత్వ తీరును నిరసిస్తూ అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించి దున్నపోతుకు తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా యూనియన్ మండల అధ్యక్షురాలు రామలక్ష్మీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్మికుల జీతాలు పెంచాలని, ఇచ్చిన హామీలు అమలు పరచాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ మొండి వైఖరి నశించాలి అంటూ నినాదాలు చేశారు. **దేవరపల్లి** స్థానికంగా జరుగుతున్న అంగన్‌వాడీల నిరసన శిబిరం వద్ద రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ తమ సమస్యలను పరిష్కరించాలని డిమార్ చేస్తూ దున్నపోతుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఎస్.భగత్ మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం దున్నపోతుపై వాన కురిసిన రీతిలో వ్యవహరిస్తుందని విమర్శంచారు. సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాల్సిన స్థానంలో ఉన్న కలెక్టర్ అంగన్‌వాడీలను బెదిరింపులకు గురిచేయడం దారుణమన్నారు. బుధవారం జరిగే కలెక్టరేట్ల ముట్టడిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు టిపి.లక్ష్మి, ఇ.పద్మకామేశ్వరి, కె.కుమారి, కె.గంగభవాని, ఎస్‌కె గౌస్య, డి.మంజు, కె.వరలక్ష్మి, డి.మహాలక్ష్మి, సిఐటియు నాయకులు కె.రత్నాజీ తదితరులు పాల్గొన్నారు. **తాళ్లపూడి** ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు తమ ఉద్యమాన్ని విరమించేది లేదని పలువురు అంగన్‌వాడీలు అన్నారు. స్థానిక ప్రభుత్వ కార్యాలయాల సముదాయాల వద్ద అంగన్‌వాడీలు కుర్చీ ఆట ఆడారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాటలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకురాలు రాగు జ్యోతి, సుజాత తదితరులు పాల్గొన్నారు. **చాగల్లు** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు తమ రిలే నిరహార దీక్షలను కొనసాగించారు. రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర నుంచి బయటపడాలని కోరుతూ దున్నపోతుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పి.విజయకుమారి, కె.లక్ష్మి, కె.దమయంతి, ఎ.శ్రీదేవి, బి.మహాలక్ష్మి, ఎస్.అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు. **పెరవలి** స్థానికంగా జరుగుతున్న అంగన్‌వాడీల నిరసన శిబిరం వద్ద రాష్ట్ర ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని దున్నపోతుకు అందచేశారు. తమ సమస్యలు పరిష్కరించేంత వరకూ సమ్మెను కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెరవలి ప్రాజెక్టు సెక్రటరీ కె.కృష్ణవేణి, బి.నాగవేణి, నాయకులు సిహెచ్.విశాలి, వి.నిర్మల, కన్యాకుమారి, రాణి, శాంతకుమారి, రామలక్ష్మి, దుర్గా, లక్ష్మి పాల్గొన్నారు.



గోపాలపురంలో దున్నపోతుకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు




రాజమహేంద్రవరం శిబిరం వద్ద మాట్లాడుతున్న బేబిరాణి



గోకవరంలో రిలే నిరహారదీక్ష చేస్తున్న అంగన్‌వాడీలు

కార్టూ'నిజం'



ప్రతిభను చాటేందుకు బాలోత్సవం దోహదం



సబ్ కలెక్టర్‌ను ఆహ్వానిస్తున్న బాలోత్సవం నిర్వాహకులు

ప్రజాశక్తి - దేవరపల్లి

విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసేందుకు బాలోత్సవం కార్యక్రమం దోహదం చేస్తుందని సబ్ కలెక్టర్ అశుతోష్ వాత్సవ్ అన్నారు. బాలోత్సవం నిర్వాహకులు సబ్ కలెక్టర్ అశుతోష్ వాత్సవ్‌ను మంగళవారం కలిసి ఆహ్వానపత్రికను అందించారు. ఈ సందర్భంగా బాలోత్సవం గోడపత్రికను సబ్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి బాలోత్సవం కార్యక్రమాలు విస్తృతంగా జరగాలని ఆకాంక్షించారు. మండల బాలోత్సవ కమిటీ అధ్యక్షులు, రాష్ట్ర మానవత కన్వీనర్ బలుసు సత్యనారాయణ బాలోత్సవం నిర్వాహణకు గల కారణాలను సబ్ కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు నల్లమాటి రామారావు, కొర్రలపాటీ శివరాం ప్రసాద్, కరటూరి పానయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత జెఎఎస్ వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. మంగళవారం తొర్రేడు సచివాలయం -1లో జెఎఎస్ శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తుందన్నారు. ఇప్పటికే 1వ విడతగా జిల్లాలో 441 జెఎఎస్ శిబిరాలను నిర్వహించి ప్రజలకు వైద్య సేవ లను అందించినట్లు తెలిపారు. 2వ విడతగా గతంలో వివిధ రకాల రోగులను గుర్తించిన వారికి అనుసం ధాన వైద్య సేవలు లక్ష్యంగా చేపడుతున్నట్లు చెప్పారు. ప్రతి ఆరునెలలు ఒకసారి ఆయా గ్రామాల్లో పట్టణ ప్రాంతాల్లో జెఎఎస్ శిబిరాలు నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మంగళ, శుక్రవారాల్లో వారంలో రెండు సార్లు, పట్టణ ప్రాంతాల్లో ప్రతి బుధవారం ఒకసారి ఈ వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రజా ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా నూతన ఆరోగ్యశ్రీ కార్డుల ద్వారా రూ.25 లక్షల వరకు వైద్య సేవలు అందచేయనున్నట్లు వివరించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కింద గ్రామాల్లో మొబైల్ వైద్య శిబిరాలు నిర్వహించి, ఉచితంగా మందులు అందచేసి, ఆరోగ్య భద్రత కోసం డాక్టర్లు సేవలందించ నున్నట్లు తెలిపారు. అంతకు ముందు తొర్రేడు సచివాలయం 1 వద్ద ఏర్పాటు చేసిన శిబిరాన్ని సందర్శించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ, గతంలో డాక్టర్లు సూచించిన కేర్ షీట్, ప్రస్తుత ఆరోగ్య స్థితిపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ కె.వేంకటేశ్వరరావు, ఆరోగ్య శ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.ప్రియాంక, తహశీల్దార్ పి.చిన్నారావు, ఎంపిడిఒ తదితరులు పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

రాజకీయాలకు అతీతంగా సంక్రాంతి క్రీడాపోటీలు

ప్రజాశక్తి - గోపాలపురం

రాజకీయాలకు అతీతంగా గ్రామస్తులంతా ఐక్యంగా సంక్రాంతి క్రీడా పోటీలను నిర్వహిం చడం అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. మండలంలోని వేలచంతల గూడెం గ్రామంలో సంక్రాంతిని పురస్కరించుకుని ఆర్ అండ్ ఎమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలను మంగళవారం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు, మాజీ ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు, గోపాలపురం నియోజక వర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు, సాంప్రదా యాలు రాజకీయాలకు అతీతంగా నిర్వహించుకోవడం అభినందనీయమని అన్నారు. ఆర్ అండ్ ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. నిర్వాహక కమిటీ సభ్యులు మాట్లాడుతూ క్రికెట్ టోర్నమెంట్‌లో 10 జిల్లాల నుంచి 24 జట్లు, ఈనెల 8, 9,10 తేదీల్లో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామని, 12 టీములు పాల్గొంటున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా వివిధ రకాల సాంస్కృతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్. అండ్ ఎం ఫౌండేషన్ అధినేత ఘంటా మధుకృష్ణ, పిన్నమనేని చిరాబాబు, సర్పంచ్ గోళ్ల దండియ్య, ఎంపిటిసి సభ్యులు సమంద్ర కొండయ్య, స్టేట్ స్పోర్ట్ డైరెక్టర్ వరలక్ష్మి, పిన్నమనేని నాగేంద్ర, ఇల్లూరి రాంబాబు, కొర్లపాటి రాము, ఎస్ఐ కె.సతీష్ కుమార్, కొర్లపాటి రాజా, గ్రామస్తులు పాల్గొన్నారు.



బ్యాటింగ్ చేస్తున్న ఎంఎల్ఎ వెంకట్రావు

'బ్లూ క్రాఫ్ట్'యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

బిక్కవోలు మండలం, తానేడు గ్రామంలో ఉన్న "బ్లూ క్రాఫ్ట్" పరిశ్రమలో అక్రమ "లేఆఫ్" ప్రకటించిన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిఐటియు డిమాండ్ చేసింది. కలెక్టరేట్ వద్ద మంగళవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జాయింట్ కలెక్టర్‌కు అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎస్-ఎస్.మూర్తి, కెఎస్‌వి.రామచంద్రరావు మాట్లాడుతూ "బ్లూ క్రాఫ్ట్" పరిశ్రమ గత 20 సంవత్సరాల నుంచి నడుస్తుందని, గతంలో ఉన్న యాజమాన్య ప్రతినిధులు యూనియన్ నాయకులతో చర్చించి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. ప్రస్తుతం ఉన్న యాజమాన్య ప్రతినిధి కార్మికులను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ముడి సరుకు కొరత ఉందన్న సాకుతో లేఆఫ్ ప్రకటించారని, అందువల్ల పరిశ్రమలో పనిచేస్తున్న 350 మంది కార్మికులు రోడ్డున పడ్డారని అన్నారు. ఇతర రాష్ట్రాలలో ఉన్న పరిశ్రమలో ముడిసరుకు కొరత లేదని, ఇక్కడ మాత్రమే కొరత ఎలా ఉంటుందని ప్రశ్నించారు. డిప్యూటి లేబర్ కమిషనర్ సమక్షంలో చర్చలు జరిగినా యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తుందని, కావున అక్రమ లేఆఫ్ ఎత్తివేసి పరిశ్రమ నడిపంచేలా చర్యలు తీసుకోవాలని జెసిని కోరారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జరగాల్సిన వేతన ఒప్పందం ఎగ్గొట్టడానికి జరుగుతునన కుట్రలో భాగమే లే ఆఫ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగేశ్వరరావు, రమణా, రాంబాబు, రవి, వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

నేరాలు ఘోరాలు


పోలీసుల అదుపులో నిందితుడు

ఎసిబి అధికారి పేరుతో మోసం : వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-మండపేట

ఎసిబి ధికారినని రూ.3,05,000 నగదు కాజేసిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామచంద్రపురం డిఎస్‌పి. టిఎస్ఆర్‌కె. ప్రసాద్ ఈ కేసుకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. నిందితుడు రాచంపల్లి శ్రీనివాసులు అనంతపురం జిల్లాలోని పట్నం మండలంలోని మల్లికవేలను గ్రామానికి చెందిన వాడన్నారు. ఇతను గత 15 సంవత్సరాలుగా దొంగతనాలు, స్నాచింగ్, మోసం, దోపిడీ తదితర నేరాలకు పాల్పడుతున్నాడని ఇతనిపై ఆంధ్రా, తెలంగాణా, కర్నాటక రాష్ట్రాలలో 100 కేసులు నమోదు అయ్యాయన్నారు. ఇతను ప్రభుత్వ ఉద్యోగులను టార్గెట్ చేస్తూ ఎసిబి అధికారులమని ఫోన్ చేసి వారిని భయభ్రాంతులకు గురి చేసి వారి వద్ద నుండి డబ్బులును దోచుకుంటాడని పదవి విరమణ కాబోతున్న ఉద్యోగులను ఎంచుకుని వారిని బెదిరించి డబ్బులు గుంజుకుంటాడన్నారు. డైలీ హంట్ యాప్ ద్వారా తమ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్ఐ వెంకటేశ్వరరావుకు ఎసిబి అధికారినని ఫోన్ చేసి నగదు కాజేశాడన్నారు. ఎస్ఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సిఐ శ్రీధర్ కుమార్ పర్యవేక్షణలో రూరల్ ఎస్ఐ బి.శివకష్ణ, సిబ్బంది నక్కా నారాయణ, దోనిపాటి రవికిషోర్, పి. గంగరాజు టీమ్ ఏర్పాటుచేసి నిందితుడు చేసిన ఫోన్ కాల్ సమాచారంతో బెంగుళూరులోఉన్నట్లు గుర్తించారన్నారు. అక్కడకు వెళ్లి నిందితుడి సమాచారం సేకరించి నిందితుడు రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ దగ్గర వున్నట్లు గుర్తించి అతనిని అదుపులోకి తీసుకుని రూ.2,10,000 రికవరీ చేశారన్నారు. కేసును ఛేదించిన సిబ్బందిని అభినందిచారు.

పంచాయతీ సిబ్బందిపై దాడి కేసు నమోదు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

డ్రైనేజీ పూడికతీత పనులు చేయిస్తున్న పంచాయతీ సిబ్బందిపై కర్రలతో దాడి చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇవి.. ఆత్రేయపురం గ్రామ సచివాలయంలో సబార్డినేట్ పనిచేస్తున్న వికలాంగుడు జివివి.సత్యనారాయణ విధి నిర్వహణలో భాగంగా మంగళవారం స్థానిక చిన్న పేటలో శానిటేషన్ నిర్మూలన లో భాగంగా డ్రైనేజీ పూడికతీత పనులు చేయిస్తున్నాడు. ఈ నేపథ్యంలో పూడిక తీసిన మట్టి వ్యర్థాలను రోడ్డుమీద వేయడంతో చెంతనే ఉన్న ఆటో మీద పడ్డాయి. బండి దిలీప్ అనే వ్యక్తి నా ఆటో పై డ్రైనేజీ వ్యర్థాలను ఎందుకు వేశారంటూ సత్యనారాయణ తో గొడవ పడి దుర్భాషలాడి కర్రతో కొట్టి గాయపరిచాడు. ఈ విషయాన్ని పంచాయతీ ఆఫీసుకు తెలియపరచడంతో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి అక్కడ చేరుకునే లోపే డిజిటల్ అసిస్టెంట్ చింత సాయిరాంను, సత్యనారాయణను బండి దిలీప్, రవికుమార్, వినయ్, పమ్మి రాజ్ కుమార్, పమ్మి బేబీ అయిదుగురు కలిసి దుర్భాషలాడి కర్రలతో కొట్టి గాయపరిచారు. దీనిపై కేసు నమోదు చేశామ ఎస్ఐ బివై .కిరణ్ కుమార్ తెలిపారు.

సారాతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

జగ్గంపేట మండలం జె.కొత్తూరులో మంగళవారం స్థానిక ఎస్ఐ నాగార్జున రాజు తన సిబ్బందితో సారా విక్రయాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కేసుబోయిన వీర్రాజును పది లీటర్ల సారాతో అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

పొలం వద్ద విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ మరమ్మతు చేస్తుండగా విద్యుదాఘాతంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సామర్లకోట పట్టణ శివారు కందకం ప్రాంతానికి చెందిన చిట్టిరాజు విద్యుత్ స్తంబాల కార్మికునిగా పనులు చేస్తుంటాడు. మంగళవారం సామర్లకోట శివారు ఎడిబి రోడ్డు రాక్ సిరామిక్ సమీపాన వ్యవసాయ పొలం వద్ద ఉన్న ట్రాన్స్‌పార్మర్ వద్ద మరమ్మతు పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో చిట్టి రాజుకు శరీరం అంతా కాలి తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం సామర్లకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి 108 వాహనంలో తరలించారు.

పేకాట శిబిరంపై దాడి ఆరుగురు అరెస్ట్

ప్రజాశక్తి - గోకవరం

స్థానిక డ్రైవర్స్ కాలని శివారులో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.23,140లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివనాగబాబు తెలిపారు.

నాటు సారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని కలవలపల్లిలో మంగళవారం ఎస్ఇబి సిఐ విటివివి సత్యనారాయణ సిబ్బంది కలసి నాటు సారా స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో కలవలపల్లి గ్రామానికి చెందిన ఎం.సుబ్బలక్ష్మి నాటుసారా విక్రయించేందుకు నిల్వ చేసిన 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, ఆమెను అరెస్టు చేశారు. దాడుల్లో ఎస్ఐ జి.బసంతి సిబ్బంది పాల్గొన్నారు.

పెత్తందారుడి నుంచి రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - సీతానగరం

తమ గ్రామానికి చెందిన పెత్తందారుడు బుల్లింకల నాగబాబు, అతని అనుచరుల నుంచి రక్షణ కల్పించాలని నల్ల గొండ గ్రామానికి చెందిన దళిత మహిళలు కోరారు. స్థానికంగా మంగళవారం గ్రామానికి చెందిన దళితులు మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. తమ గ్రామంలో నాలుగైదు దశాబ్దాల నుంచి ఇళ్లు నిర్మించుకుని జీవిస్తు న్నామని, ఇంటి పన్నులు, కుళాయి పన్నులు పంచాయితీకి చెల్లిస్తున్నామని అన్నారు. అయితే తమ గ్రామానికి చెందిన పెత్తందారుడు బుల్లిం కల నాగబాబు అనే వ్యక్తి ఇప్పుడు తాము ఉంటున్న నివాశాలన్నీ తనకు చెందిన భూమిలో ఉన్నాయని, తక్షణమే ఖాళీ చేయకపోతే ఇళ్లన్నిం టినీ తగులబెడతానని బెదిరింపులకు పాల్ప డుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయ సర్వేయర్ ప్రమీల గ్రామ పెత్తందారు నాగబాబుతో కుమ్మక్కై, తమపై ఒత్తిడి తెస్తున్నారని అన్నారు. గత 35 సంవత్సరాలుగా ఇక్కడే నివస్తున్నామని, ఇప్పుడు వచ్చి ఆ భూమి మాది అంటే ఎలా దళితులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా తమపై జరుగుతున్న ఒత్తిడులు, బెదిరింపులను నిలుపుదల చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, తమకు జరుగుతున్న అన్యాయంపై ఎస్‌సి కమిషన్ దృష్టి సారించి న్యాయం చేయాలని కోరారు. తమ నివాసాలకు ఏవిధమైన హాని జరిగిన దానికి నాగబాబే బాధ్యత వహించాల్సివుంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో మద్దాల మేరి, కొమ్మర సద్గుణ, కొమ్మర ప్రవీణ, కొమ్మర బుజ్జమ్మ, కండెల్లి చింతాలమ్మ, మద్దాల అరవాలమ్మ, కొమ్మర సుబ్బాయమ్మ, కొమ్మర రాంబాబు, కొల్లి జాన్, కొల్లి రత్నరాజు, మంచెల్లి అరుణ, తదితరులు పాల్గొన్నారు.


మీడియా వద్ద నినాదాలు చేస్తున్న దళితులు

విద్యారంగంలో వినూత్న సంస్కరణలు

ప్రజాశక్తి - చాగల్లు, తాళ్లపూడి, కొవ్వూరు రూరల్

సిఎం జగన్మోహన్ రెడ్డి విద్యారం గంలో వినూత్నమైన సంస్కరణలను తీసుకొస్తున్నారని హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. నియోజక వర్గ పరిధిలోని చాగల్లు, తాళ్లపూడి మండలం పెద్దేవం, కొవ్వూరు మండలం దొమ్మేరులో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాలు జరిగాయి. ఆయా కార్య క్రమాల్లో మంత్రి పాల్గొని విద్యార్థులకు అందచేశారు. ఈ సందర్భం గా మంత్రి మాట్లాడుతూ ట్యాబ్‌ల పంపిణీ విషయం లో ప్రతిపక్షాలు రాజకీయం చేయడం సరికాదని, ప్రభుత్వంపై బురద జల్లే అబద్ధపు ప్రచారాలను తల్లిదండ్రులు నమ్మవద్దని తెలిపారు. బైజుస్ కంటెంట్‌తో పిల్లలకు ప్రభుత్వం అందించే ఉచిత ట్యాబ్‌లలో లాకింగ్ విధానం కూడా ఉందన్నారు. ఒకవేళ ఎవరికైనా ఇబ్బంది కలిగితే సంబంధిత హెచ్‌ఎంలకు ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటారని వివరిం చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, విద్యాధికారులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.


చాగల్లులో ట్యాబ్‌ను పంపిణీ చేస్తున్న మంత్రి వనిత

చలో విజయవాడను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - గోపాలపురం

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, మాన్‌డేటెడ్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జనవరి 4న తలపెట్టిన చలో విజయవాడను జయప్రదం చేయాలని రాష్ట్ర ఫీల్డ్ అసిస్టెంట్లు యూనియన్ ఉపాధ్యక్షులు మహేష్ పిలుపునిచ్చారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు ఈ చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని ఇప్పటికే ప్రభుత్వానికి, అధికారులు వివిధ రూపాల్లో తెలియచేసామని, అయినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. విధిలేని పరిస్థితుల్లోనే చలో విజయవాడ కార్యక్రమాన్ని తెలపెట్టినట్లు వివరించారు. కావున పెద్ద ఎత్తున ఫీల్డ్ అసిస్టెంట్లు చలో విజయవాడలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

యువత క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - గోకవరం

అడుదాం ఆంధ్రా క్రీడల్లో యువతీ, యువకులు రాణిం చాలని వైసిపి మండల కన్వీనర్ పాటి.రాంబాబు అన్నారు. మంగళ వారం మండలంలోని రంప ఎర్రంపాలెం గ్రామంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో నిర్వహించే క్రీడా పోటీల్లో రాణించడం ద్వారా మండల స్థాయిలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. వివిధ దశల్లో నిర్వహిస్తున్న ఈ క్రీడల్లో రాణించి మీ మీ గ్రామాలకు గుర్తింపును తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, యువతీ, యువకులు పాల్గొన్నారు.


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న రాంబాబు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - దేవరపల్లి

దేవరపల్లి గ్రామంలో ఎస్‌సి ప్రాంతంలో రూ.52 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం మొదలుపెట్టిన పనులను త్వరగతిన పూర్తి చేస్తామన్నారు అనంతరం దేవరపల్లి మండల కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన నూతన పెన్షన్ కానుక పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరావు, ఎంపిపి దుర్గారావు, జడ్‌పిటిసి స్వర్ణలత, సర్పంచ్ కడిమి వీరకుమారి, వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్‌ఎ తలారి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని వెంకటేశ్వర నగర్ విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలోని 11కెవి రామాలయం రోడ్ ఫీడరు పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఆపరేషన్స్) నక్కపల్లి శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. జయశ్రీ గార్డెన్స్, కోక భాస్కరమ్మనగర్, పిల్లి వారి స్ట్రీట్, జెఎన్ రోడ్, తోట రాములు నగర్, శ్రీనివాస నగర్‌లో విద్యుత్ సరఫా ఉండదన్నారు. అలాగే ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ బైబిల్ ఫ్లేస్ ఫీడర్ పరిధిలో సాయి నగర్, ఎవి అప్పారావు రోడ్డు, షీలానగర్, గోపాలనగర్ పుంత, శ్రీనివాస గార్డెన్స్, అద్దేపల్లి కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

అన్నార్తులకు ఆసరాగా 'ఊపిరి ఫౌండేషన్'

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కష్టాల్లో ఉన్న అభాగ్యులను ఆదుకు నేందుకు... ఇబ్బందుల్లో ఉన్న విద్యార్థులకు సహ కారం అందించే దుకు... అనాథ పిల్లలను దత్తత తీసుకుని వారిని అక్కున నేర్చుకునేందుకు ఊపిరి ఫౌండేషన్ ఏర్పాటు చేయ డం అభినందనీయమని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. 42వ డివిజన్‌కు చెందిన టిడిపి నాయకులు ఆడారి లక్ష్మీనారాయణ, ఆడారి భాగ్యలక్ష్మి దంపతులు "ధనముంటే ధనవంతుడు అంటారు... కానీ దాన గుణం ఉంటే దేవుడు అంటారు" అనే ట్యాగ్ లైన్‌తో 'ఊపిరి ఫౌండేషన్'ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ లోగోను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంచి ఆలోచన, సేవా భావంతో ఊపిరి ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ఆడారి లక్ష్మీనారాయణ, భాగ్యలక్ష్మి దంపతులను వారు అభినందించారు. ఇటువంటి మంచి కార్యక్రమాలకు తాము కూడా సహకారం అందిస్తామన్నారు. ఆడారి లక్ష్మీనారాయణ.. భాగ్యలక్ష్మి దంపతులు మాట్లాడుతూ సమాజానికి సేవ చేయాలన్న లక్ష్యంతోనే ఈ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనాథ పిల్లలను దత్తత తీసుకుని వారికి విద్యాబుద్ధులు చెప్పించడం వంటి సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. తమను ప్రోత్సహించి ముందుకు నడిపించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం స్థానిక ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కోరుకొండ రోడ్డులోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకరన్, భక్తురాలు గాయత్రి కలిపి చెక్కు అందచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మళ్ల వెంకట్రాజు, ఉర్లంకల లోకేష్, దుద్దేటి నాగేంద్ర యాదవ్, కెవి.శ్రీనివాస్, జగన్నాథం, నాగేంద్ర, తాతాజీ, తదితరులు పాల్గొన్నారు.



లోగోను ఆవిష్కరిస్తున్న ఆదిరెడ్డి

ఇసుక అక్రమ రవాణాపై నేడు సమావేశం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని మునికూడలి ఇసుక ర్యాంపు నుంచి అక్రమంగా రవాణా అవుతున్న అంశంపై నిజనిర్ధారణ చేసేందుకు టిడిపి నియోజకవర్గ సమావేశం నేడు మునికూడలి గ్రామంలో నిర్వహించనున్నట్లు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ బొడ్డు వెంకట రమణ చౌదరి తెలిపారు. మంగళవారం సాయంత్రం మునికూడలి గ్రామంలో అక్రమ ఇసుక రవాణాపై జరిగిన మండల స్థాయి సమావేశంలో మండల పార్టీ నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా వెంకట రమణ చౌదరి మాట్లాడుతూ ఇసుక ర్యాంపులు ఉన్న పరిధిలో మాత్రమే రహదారి నిర్మాణం చేశారని, రఘుదేవపురం నుంచి సీతానగరం వరకు రోడ్డు విస్తరణ పనులను చేపట్టడం లేదన్నారు. అధికార పార్టీ నేతలు ఇసుక అక్రమ తవ్వకాలకి, రవాణా చేయడానికి మాత్రం ర్యాంపులో బాటవేయడాని గ్రావెల్, కొబ్బరాకులు సప్లయి చేసి లాభాలను బొక్కుతున్నారని విమర్శంచారు. ఇసుక ర్యాంపు అనుమతులు, ఏయే అనుమతులు ప్రభుత్వం నిజనిర్ధారణ చేసేందుకు నేడు మునికూడలిలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం వాస్తవాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో టిడిపికి చెందిన మండల నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బొడ్డు వెంకటరమణ చౌదరి


ప్రక్కిలంకలో అన్నదానం


భోజనాలు చేస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండల పరిధిలోని ప్రక్కిలంక భక్తాంజనేయ స్వామి ఆలయ ఉత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు సొలస కాశీ విశ్వనాథం మాట్లాడుతూ ప్రజల సహకారాలతో గత 23 సంవత్సరాలుగా ఉత్సవాలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యదర్శి సొలస గిరిధర్ గాంధీ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మహాశివరాత్రి రోజున ఇదే రీతిలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు.

టిడిపిలో పలువురి చేరిక


పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న ఆదిరెడ్డి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సిఎం జగన్మోహన్ రెడ్డి విధానాలతో విసిగిపోయిన ఆ పార్టీకి చెందిన వారు, ప్రజలు టిడిపిలోకి వస్తున్నారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 37వ డివిజన్‌కు చెందిన నిమిషకవి వెంకటేష్, 7వ డివిజన్ గోరక్షణపేటకు చెందిన సేవా రత్న జాతీయ అవార్డు గ్రహీత గంటసాల అశ్విని కుమార్ గుప్త వైసిపిని వీడి టిడిపిలో చేరారు. వారికి ఆదిరెడ్డి శ్రీనివాస్, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, ఉపాధ్యక్షులు ఉప్పులూరి జానకి రామయ్య పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఏ ఒక్కరిని కదిలించినా అంతులేని దుఖంతో సమస్యలు వెల్లబుతున్నారని అన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా చేసి అభివృద్ధిని పక్కన పెట్టేశారన్నారు. ఇచ్చే సంక్షేమం కూడా వివిధ పన్నుల రూపాల్లో భారాలు మోపి కంటితుడుపు చర్యగా అడలా దడపా పథకాలు అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇటువంటి తరుణంలో బాధ్యత కలిగిన రాష్ట్ర ప్రజలంతా టిడిపి, జనసేన కూటమిని ఆదరించి వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నగర అధ్యక్షులు ఉర్లంకల లోకేష్, ఎస్‌సి సెల్ నగర అధ్యక్షులు చాపల చిన్నరాజు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక




ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక పువ్వాడ సత్యమాంబా స్మారక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం వీరభద్రరావు వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా అథ్లెటిక్స్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో నిర్వహించిన పోటీలలో తమ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు ఓసిరెడ్డి వీరవెంకట దుర్గారాధా 600 మీటర్ల పరుగు పందెంలోను, బోలా శ్యామ్ 60 మీటర్ల పరుగు పందెంలో అసమాన ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. ఇదే విషయాన్ని నియోజకవర్గ ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా దృష్టికి తీసుకెళ్లామని, అహ్మదాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆ విద్యార్థులు పాల్గొనేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారని తెలిపారు. విద్యార్థులను చరవాణి ద్వారా అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎం వీరభద్రరావు, వ్యాయామ ఉపాధ్యాయులు సింహాద్రి, జిఎస్ఎస్ శంకర్ అభినందించారు. జాతీయస్థాయి పోటీలలో విజయం సాధించి సీతానగరం మండలానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

జగన్ సంక్షేమ, అభివృద్ధిని గుర్తుంచుకోవాలి

ప్రజాశక్తి - గోకవరం



సిఎం జగన్మోహన్ రెడ్డి పాలనలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధిని ప్రజలు గుర్తించుకోవాలని ఎంపిపి సుంకర శ్రీవల్లి అన్నారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఎంపిపి మాట్లాడారు. మండలంలో 10,866 మందికి వివిధ రకాల పింఛన్లను ఇస్తున్నామని, ఈ నెల నుంచి కొత్తగా మంజూరు అయిన 218 పింఛన్లతో కలిపి 11,074 మందికి బుధవారం రూ.3 వేల చొప్పున అందించనున్నట్లు చెప్పారు. నిరంతరం పేదల కోసం ఆలోచన చేస్తూ ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లను అందిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో వైసిపి సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు పాల్గొన్నారు.

వైసిపి ఇన్‌ఛార్జ్‌ల నియామకం

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

వచ్చే ఎన్నికలను వైసీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో నియోజకవర్గాల ఇంచార్జ్‌లను నియమిస్తోంది. తాజాగా మంగళవారం అధిష్ఠానం రెండో జాబితాను విడుదల చేసింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గానికి మాజీ మంత్రి, ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ కుమారుడు పిల్లి సూర్యప్రకాష్, పి.గన్నవరం (ఎస్‌సి) నియోజకవర్గానికి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, పిఠాపురానికి కాకినాడ ఎంపీ వంగా గీత, జగ్గంపేటకు మాజీ మంత్రి తోట నరసింహం, ప్రత్తిపాడుకు మాజీ ఎంఎల్‌ఎ వరుపుల సుబ్బారావు, రాజమండ్రి సిటీకి ఎంపీ మార్గాని భరత్, రాజమండ్రి రూరల్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రస్తుతం మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను నియమిస్తూ అధిష్టానం ప్రకటించింది.

యానాం వార్తలు

ఆర్ట్స్ ఎగ్జిబిషన్‌లో నవోదయకు ద్వితీయం

ప్రజాశక్తి - యానాం

ఢిల్లీలో నిర్వహించిన అఖిల భారత జవహర్ నవోదయ విద్యాలయాల జాతీయ స్థాయి చిల్డ్రన్స్ ఆర్ట్స్ ఎగ్జిబిషన్లో స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ ద్వితీయ స్థానం సాధించిందని ప్రిన్సిపల్ టివిఎస్ ప్రకాశరావు తెలిపారు. ఈ సందర్భంగా 20 మంది విద్యార్థినీ విద్యార్థులు చిత్రించిన విజువల్ ఆర్ట్స్ 55 చిత్రపటాలు ప్రదర్శించారన్నారు. త్వరలో ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగే 'పరేక్షా పే చర్చా' కార్యక్రమంలో విద్యార్థులు తయారు చేసిన పెయింటింగ్స్, లక్క బొమ్మలు ప్రదర్శించనున్నట్లు నవోదయ విద్యాలయ సమితి ఢిల్లీ వారు తెలియజేశారన్నారు. విజేతలకు నవోదయ విద్యాలయ కమిషనర్ వినాయక్ గర్గ్, భారత ప్రభుత్వ విద్యాశాఖ జాయింట్ సెక్రెటరీ సంజయ్ కుమార్ ద్వారా బహుమతులు ప్రదానం చేశారన్నారు. ఈ మేరకు విద్యార్థులు మణికంఠ, సతీష్, మనోజ్, దుర్గేష్ కళా అధ్యాపకులు వెంకటేశ్వర్లు, లక్క బొమ్మలు తయారీకి సహకరించిన తామరపల్లి వరహాలును అభినందించారు.

5న విద్యుత్ సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి - యానాం

విద్యుత్ వినియోగదారుల నుంచి జనవరి 5న ఉదయం 10 గంటల నుంచి ఫిర్యాదులు స్వీకరించడానికి ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరు లంక కృష్ణారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిల్లులు జారీ ఆలస్యం, సవరణ, మీటర్ల మార్పు, విద్యుత్ అంతరాయం, తక్కువ వోల్టేజ్ అంశాలపై ఫిర్యాదులు స్వీకరిస్తామని తెలిపారు.

నేడు కేంద్ర మంత్రుల పర్యటన

యానాం : కేంద్ర ఫిషరీస్, పశుసంవర్ధక మరియు పాడి పరిశ్రమ శాఖామంత్రి పరుషోత్తమ్ రూపాల, కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ బుధవారం యానాంలో పర్యటించనున్నారని ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట నుండి మూడు గంటల వరకు సావిత్రి నగర్ ఫిషింగ్ హార్బర్ వద్ద ఏర్పాటు చేసిన ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొననున్నారు. కేంద్ర మంత్రులు మత్స్యకారులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో సావిత్రి నగర్, గిరియంపేట, మత్స్యకార గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఎల్‌ఎ గొల్లపల్లి అశోక్ కోరారు.

మున్సిపల్ కార్మికులకు యూనిఫాం అందజేత

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం సచివాలయంలో వాలంటీర్‌గా పనిచేస్తున్న ముప్పన కృపావర ప్రసాద్ రెడ్డి తన తల్లిదండ్రులు చిన యేసురెడ్డి, జానికమ్మల జ్ఞాపకార్థం 20 మంది మున్సిపల్ కార్మికులకు యూనిఫారంను అందించారు. సొసైటీ చైర్మన్ కూసం రామ్మోహన్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ తల్లీదండ్రుల జ్ఞాపకార్థం ఇటువంటి సేవా కార్యక్రమం చేపడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో అప్పిరెడ్డి, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, మానవత సంస్థ మాజీ అధ్యక్షుడు నెల్లి చంద్రశేఖర్, ముద్దన మురళీకృష్ణ, వింత ప్రసాదొడ్డి, పంచాయతీ కార్యదర్శి వి.రాఘవరెడ్డి పాల్గొన్నారు. కాగా గోపాలపురం పంచాయతీలోని పెద్దగూడెంలో అనారోగ్యానికి గురైన కడిమి బుచ్చమ్మకు మానవత సంస్థ సభ్యుడు మద్దిపాటి గంగరాజు రూ.2 వేలను సాయం చేశారు.